## కడుపునొప్పి భరించలేక గృహిణి ఆత్మహత్య



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్ )ఆగస్టు 15: కడుపునొప్పి భరించలేక గృహిణి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఖిలాషాపూర్ లో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాల్నే ఉపేంద్ర (58) గత రెండు మూడు నెలల నుండి తీవ్రమైన కడుపునొప్పి తో భాదపడుతుండగా ఆస్పత్రిలో చూపించి చికిత్స చేయించారు. శుక్రవారం రాత్రి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి శనివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు వెంటనే జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెం దింది. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, కుమారుడు మధుకర్. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐఐ డి.నరేష్ తెలిపారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




వ ా న ు వ ు కొ ం డ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 15/అక్షరం న్యూస్:-

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భీమదేవరపల్లి మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ పతాకాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. యువజన, మహిళా, కుల సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పలుచోట్ల మిఠాయిలు పంపిణీ చేశారు. భీమదేవరపల్లి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బొంగోని రాజేష్, ముల్కనూర్, వంగర పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజు, దివ్య, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వీరేశం, ముల్కనూర్ సహకార సంఘంలో సొసైటీ చైర్మన్ అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో ఈవో కిషన్ రావు, ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్ లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల వ్యాప్తంగా జరిగిన వేడుకల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్ లు కార్యదర్శులు, పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 17 నుంచి ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం .....

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రజల సౌకర్యార్థం మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణ..
- మండలంలోని ప్రజలు తమ దరఖాస్తులను మండల స్థాయిలోనే అందజేయాలి..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 15( అక్షరం న్యూస్)

ఆగస్టు 17వ తేదీ నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి మండల స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మండలంలోని ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నందున, తమ సమస్యలు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన.అడిషనల్ డీసీపీ అడ్మిన్



ఖమ్మం జిల్లా/ఖమ్మం టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

80వ.భారత స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీస్, హోంగార్డు, మినిస్ట్రీయల్ స్టాఫ్ సిబ్బందికి స్వాత్రంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్ లో 80వ భారత స్వాత్రంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్ పర్సన్ శ్రీమతి నిష్ఠాశర్మ జెండా ఆవిష్కరించారు. ఆనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు. సిఏఆర్ హెడ్ క్వార్టర్స్‌సిటీ ఆర్మడ్ రిజర్వు హెడ్ క్వార్టర్స్ ఏ ఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## రామగుండం కమిషనరేట్ ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీపీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 15 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్., మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన గౌరవ వందనాన్ని స్వీకరిస్తూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ రామగుండం కమిషనరేట్ పరిధిలోని ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు, చేసిన ప్రాణబలిదానాలు చిరస్మరణీయమని అన్నారు.వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛాయుతమైన, ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి భారతీయుడికి ఎంతో ముఖ్యమైన రోజని, బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం లభించిన ఈ రోజు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసిన చారిత్రక ఘట్టమని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఆధ్వర్యంలో దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం కూడా అనేక రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు.అభివృద్ధితో పాటు సమాజంలో సామరస్యం,ప్రజల మధ్య ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ఈ అభివృద్ధి ప్రయాణంలో పోలీసు శాఖ కూడా ప్రజలతో కలిసి పనిచేస్తోందన్నారు.శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ,ట్రాఫిక్ నిర్వహణతో పాటు విపత్తులు,అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం పోలీసుల ప్రధాన బాధ్యతలని తెలిపారు.విధుల స్వరూపం, పరిస్థితులు మారుతున్నప్పటికీ పోలీసుల లక్ష్యం ఒక్కటేనని,ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే పోలీసు శాఖలో చేరామని పేర్కొన్నారు.అదే సేవాభావం, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు,రాష్ట్ర అభివృద్ధికి పోలీసు అధికారులు,సిబ్బంది తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సీపీ విజ్ఞప్తి చేశారు.పోలీసులతో సమన్వయంతో పనిచేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు,సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలు--పోలీసులు సమన్వయంతో ముందుకు సాగితే మరింత సురక్షితమైన, ప్రశాంతమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు.ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,వారు ప్రశాంతమైన వాతావరణంలో జీవించేలా అన్ని విధాలా కృషి చేస్తామని సీపీ తెలిపారు.ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీ ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ రమేష్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఏఓ శ్రీనివాస్,సీఐలు, ఎస్ఐలు,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, మల్లేశం,రమేష్, సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి, మనోజ్,సందీప్, సంధ్య,సీసీ సందీప్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు,సిబ్బంది, సీపీఓ,ఏఆర్,స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల భరోసా...

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ఖమ్మం జిల్లాలో 62 వేల కొత్త రేషన్ కార్డులు.. సుమారు 2 లక్షల మందికి ప్రయోజనం
- 1.06 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ..
- పజా ప్రభుత్వంలో ప్రతి రూపాయి పేద కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలకే..
- ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.10,700 కోట్లు ప్రభుత్వం చెల్లింపు..
- రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు..
- స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)స్మార్ట్ రేషన్ కార్డులతో పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల భరోసా లభిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. బ్రిటిష్ పాలనలో శతాబ్దాల పాటు బానిసలుగా జీవించిన భారతీయులు స్వాతంత్ర్యం కోసం ఎన్నో పోరాటాలు చేశారని , 1885లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆవిర్భవించిన అనంతరం బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో పోరాట యోధులు ప్రాణత్యాగం చేశారని, మరెందరో దశాబ్దాల పాటు జైళ్లలో గడిపారని గుర్తు చేశారు. వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించిందని, ప్రజలు తమ ప్రభుత్వాలను తామే ఎన్నుకుంటూ స్వేచ్ఛగా జీవించే అవకాశం లభించిందని పేర్కొన్నారు.ప్రజాప్రభుత్వం రాష్ట్రంలోని పౌరులకు రేషన్ కార్డుల ద్వారా కొత్తగా అదనంగా డిజిటల్ కార్డులను అందజేసి ఎటువంటి ఆహార కొరత లేకుండా ప్రజలకందరికీ అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని, రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 1,06,28,092 కుటుంబాలకు రేషన్ కార్డులు అందిస్తున్నామని, 3.42 కోట్లకు పైగా లబ్ధిదారులకు నెలకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.55 వరకు ఉన్నప్పటికీ పూర్తి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ పేదలకు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సన్నబియ్యం పంపిణీ చేయకుండా దొడ్డు బియ్యం మాత్రమే పంపిణీ చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి కొత్త లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు.రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా పేద కుటుంబాలకు అన్ని సంక్షేమ పథకాలకు అర్హత కల్పించే ముఖ్యమైన ఆధారమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, కొత్త రేషన్ కార్డు పొందిన కుటుంబాలు కూడా ఆరోగ్యశ్రీ ప్రయోజనం పొందుతాయని అన్నారు.రేషన్ కార్డుల ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి...

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకు చేరేలా ఉద్యోగులు కృషి చేయాలి..
- కలెక్టర్ క్యాంప్ ఆఫీస్, జడ్పీ కార్యాలయాలలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..
- జాతీయ జెండా ను అవిష్కరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, మహనీయుల ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.అంతకుముందు జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని కలెక్టర్ జాతీయ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, నేటి స్వేచ్ఛ వెనుక ఎన్నో త్యాగాలు ఉన్నాయన్నారు.ప్రజలు బాధ్యతతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఉద్యోగులు నిబద్ధతతో సేవ చేయాలని, దేశ ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న సమసమాజ స్థాపన, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలను కూడా కల్పించిందని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేయాలని అధికారులకు సూచించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు చేరేలా అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజలందరూ పరస్పర సోదరభావంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా సమష్టి కృషి చేయాలని, ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పి సీఈవో దీక్షారైనా, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఈఈ మహేష్ బాబు, కలెక్టర్ క్యాంప్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం లో ఉత్తమ ఉద్యోగి అవార్డు..

ఖమ్మం జిల్లా/తల్లాడ టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

ఖమ్మం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్స్‌లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు నిర్వహించిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ ఉద్యోగి -- జూనియర్ అసిస్టెంట్ అవార్డును తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న నల్లగొండ శ్రీను అందుకున్నారు.ఆగస్టు 15, 2026న జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.విధి నిర్వహణలో నిబద్ధత, బాధ్యతాయుతంగా సేవలందించడం, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో చూపిన పనితీరుకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా నల్లగొండ శ్రీను మాట్లాడుతూ, "ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. ఈ గుర్తింపు మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. నాకు సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులు మరియు సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.



## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలోఘనంగా పంద్రాగస్టు వేడుకలు..

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సుడా
- చైర్మన్ పువ్వాళ్ళ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి స్వర్ణకుమారి, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి



ఖమ్మం జిల్లా /ఖమ్మం టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

ఖమ్మం: పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో.. శనివారం ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆవిష్కరించగా..టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందని అన్నారు. ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి.. నిరంతరం ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని తెలిపారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో పర్యటిస్తూ.. అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో పలు అంశాలపై ఉభయ జిల్లాల సమస్యలను లేవనెత్తుతూ, కేంద్రమంత్రులను కలిసి విజ్ఞప్తి చేస్తూ..కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చూస్తున్నారని చెప్పారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. ప్రజలంతా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకుందామని ఈ సందర్భంగా.. నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో.కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ప్రతిభా రెడ్డి, పట్టాభి, మియా భాయ్, ఇమామ్, గోనె భుజంగ రెడ్డి, ఎనిగళ్ళ నాగేశ్వరరావు, గడ్డం శ్రీకళా రెడ్డి, మాజీద్, గౌస్, ఉమర్, ఉమా గౌడ్, నరసింహారావు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐదో వార్డులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి అంగన్వాడీ కేంద్రంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, వార్డు ప్రజలతో కలిసి పాల్గొన్నారు.అనంతరం వైరా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలోనూ కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో అంగన్వాడీ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధులు త్యాగాలను స్మరించుకోవాలి ..

- జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ .



ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను రాందాస్ నాయక్ ఆవిష్కరించి స్వాతంత్ర ఫలాలను గురించి వివరించారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలు సైతం త్యాగం చేసి సాధించిన స్వేచ్ఛను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు మహాత్మా గాంధీ భగత్ సింగ్ సుభాష్ చంద్రబోస్ అల్లూరి సీతారామరాజు తదితర స్వతంత్ర సమరయోధులు త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు , వైరా పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# భావి భారతానికి జర్నలిస్టులు మార్గదర్శకులు కావాలి

- స్వేచ్ఛా భారత నిర్మాణంలో పాత్రికేయుల బాధ్యత మరింత కీలకం..
- అమరవీరుల త్యాగఫలమే నేటి స్వాతంత్ర్య వేడుకలు..
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్



ఖమ్మం జిల్లా/ఖమ్మం టౌన్ ఆగస్టు 15( అక్షరం న్యూస్)

ఎందరో అమరవీరుల త్యాగాలు, పోరాటాలు, నిరంతర ఉద్యమాల ఫలితంగా దేశానికి లభించిన స్వాతంత్ర్య స్ఫూర్తిని భవితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దగ్గుపాటి మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం అనేది కేవలం పాలకుల మార్పు కాదని, ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, గౌరవంతో జీవించే హక్కును అందించిన మహత్తర ప్రజాస్వామ్య విలువ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య భారతాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ ప్రాణవాయువు అని పేర్కొంటూ, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజల గొంతుకను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడం, ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యతలని అన్నారు. ప్రభుత్వం--ప్రజలకు మధ్య వారధిగా, ప్రజాస్వామ్యానికి కాపలాదారులుగా జర్నలిస్టులు తమ పాత్రను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అవినీతి, వివక్ష, పేదలు--బలహీనవర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు, ప్రజలకు హక్కులపై అవగాహన కల్పించడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. అదే సమయంలో వార్తల సేకరణ, ప్రచురణలో వాస్తవ నిర్ధారణ, నిష్పక్షపాత వైఖరి, సామాజిక బాధ్యత, మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం అవసరం అని సయ్యద్ ఖదీర్ అన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడటంతో పాటు జర్నలిస్టులకు రక్షణ, వృత్తిపరమైన గౌరవం, సంక్షేమం, సామాజిక భద్రత, మెరుగైన పని పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు టిడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ప్రస్తుత కాలంలో సమాచార విప్లవం, సోషల్ మీడియా విస్తరణతో జర్నలిజం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. తప్పుడు వార్తలు, నిర్ధారణ లేని సమాచారం, వదంతులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉన్నందున జర్నలిస్టులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిజాన్ని నిర్భయంగా చెప్పడం, వాస్తవాన్ని వక్రీకరించకుండా ప్రజల ముందుంచడం, బలహీనుల పక్షాన నిలవడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ద్వారా జర్నలిస్టులు సమాజానికి దిశానిర్దేశం చేయాలని కోరారు.భావి భారతాన్ని శాస్త్రీయ, ప్రజాస్వామ్య, లౌకిక, సమానత్వ విలువలతో నిర్మించడంలో జర్నలిస్టులు చైతన్య దీపికలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. యువతలో దేశభక్తి, రాజ్యాంగ విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథాన్ని పెంపొందించేలా పాత్రికేయ రంగం మరింత నిర్మాణాత్మక పాత్ర పోషించాలని అన్నారు. జెండా రెపరెపల మధ్య దేశభక్తి నినాదాలతో ప్రెస్ క్లబ్ ప్రాంగణం మార్మోగగా, స్వాతంత్ర్య స్ఫూర్తిని కాపాడుతూ జర్నలిస్టులు ప్రజాస్వామ్య పరిరక్షణకు అంకితమమవ్వాలని పిలుపునిచ్చారు.

## మధిరలో ఘనంగా మున్నూరు కాపు సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన మున్నూరు కాపు నాయకులు..




ఖమ్మం జిల్లా/ మధిర టౌన్ ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

మున్నూరు కాపు కులస్తుల సంక్షేమమే మున్నూరు కాపు సంఘం ప్రధాన లక్ష్యమని సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు శీలం శెట్టి వీరభద్రరావు జిల్లా కార్యదర్శి పసుపులేటి దేవేందర్ అన్నారు.శుక్రవారం రాత్రి మధిర మున్సిపాలిటీ 18వ వార్డు, అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మున్నూరు కాపు సంఘం కార్యాలయాన్ని సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.ముఖ్య అతిథులు:-ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్నూరు కాపు జిల్లా నాయకులు వదిలి రవికుమార్, మధిర మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్, 8వ వార్డ్ కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగశెట్టి కోటేశ్వరరావు, మాజీ కో ఆప్షన్ సభ్యులు కొఠారి రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ప్రసంగం:-

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ "మున్నూరు కాపు కులస్తుల సంక్షేమానికి, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారు ముందుండేలా ప్రతి ఒక్కరం కృషి చేయాలి. సంఘ అభివృద్ధికి అందరి తోడ్పాటు అవసరం. మున్నూరు కాపుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని" కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి నాగేంద్ర, శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి కృష్ణ, వీరశెట్టి సీతారాములు, రామిశెట్టి శ్రీనివాసరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, లంకె మల్ల నాగేశ్వరావు, జున్ను సుదర్శన్, పసుపులేటి సత్యనారాయణ, ధర్మపురి నరసింహారావు, యటికల కృష్ణారావు, నీలం వెంకటేశ్వరరావు, సిదా కృష్ణ, చెన్నంస్వామి, పాలెపు వెంకటేశ్వరావు, రంగిశెట్టి చిరంజీవి, రావూరి రామకృష్ణ, ఇల్లూరి నవీన్, పగడాల శివ, చిన్నం వెంకటేశ్వరరావు నల్లొండ నరసింహారావు, గుర్రం సురేష్, చింతకాని మండల అధ్యక్షుడు తిరుపతి అంజయ్య, ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు కామిశెట్టి శీను, బోనకల్లు మండల అధ్యక్షుడు రామిశెట్టి శ్రీనుతో పాటు మున్నూరు కాపు సంఘ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 108 సర్వీస్ లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గొల్ల మందల కృష్ణ కి ప్రశంస పత్రం

- సత్తుపల్లి 108 ఈఎంటి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల. కృష్ణ కి ప్రశంస పత్రం అందజేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం జిల్లా/ సత్తుపల్లి ఆగస్టు 15 (అక్షరం న్యూస్)

ఖమ్మం లో జరిగిన 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో ఖమ్మం జిల్లాలో 108 సర్వీస్ లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను సత్తుపల్లి 108 ఈఎంటి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల. కృష్ణ ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , ఖమ్మం జిల్లా కలెక్టర్ టి. ఎస్. దివాకర్ ఐఏఎస్ ప్రశంస పత్రం తో అభినందించారు. ఈ సందర్భంగా గొల్లమందల. కృష్ణ ని సత్తుపల్లి ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ డెంట్ బి.సురేష్ నారాయణ ,108 సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ షేక్. నజీరుద్దీన్ , 108 సర్వీస్ జిల్లా మేనేజర్ ఆలేటి. ప్రణయ్ కుమార్ అభినందించారు.

## రాష్ట్ర అభివృద్ధిలో తెలంగాణ సర్కార్ మార్క్..

- పాలేరు పురోగతిలో పొంగులేటి ప్రస్థానం..
- మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 16 (అక్షరం న్యూస్)

ఖమ్మం : ప్రజాక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు స్థాయి పాలన అందిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

### సంక్షేమ శకంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం..

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పేదల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక ఊరటనిచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. తాజాగా శనివారం నుంచే లబ్ధిదారులకు ఉచిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టడం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు.

### పొంగులేటి నాయకత్వంలో సరికొత్త శకం..

రికార్డు స్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన మార్క్ పాలనతో దూసుకుపోతున్నారని నాయకులు ప్రత్యేకంగా కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదల సొంతింటి కలను నిజం చేసే 'ఇందిరమ్మ ఇండ్లు', భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే 'భూభారతి' పథకాలను పొంగులేటి తన సమర్థవంతమైన నాయకత్వంతో దిగ్విజయంగా పరుగులు తీయిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా పాలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్నారని స్పష్టం చేశారు. మౌలిక వసతులైన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సౌకర్యాలతో పాటు విద్యా, వైద్య రంగాలకు ఊపిరిపోస్తూ నియోజకవర్గ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేశారని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుపుకోవడం పొంగులేటి దార్శనికతకు నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, ఏదులాపురం మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ వేమిరెడ్డి శివదేవి వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రతిభా రెడ్డి, షాహెలా జావేద్, మద్ది మల్లా రెడ్డి, మంగీలాల్, అర్వపల్లి శివకుమార్, లింగాల రవికుమార్, శ్రీకళా రెడ్డి, తిరుపతమ్మ, రమాదేవి, పద్మజా రెడ్డి, పద్మ, దుంపల రవి, ప్రతాపనేని రఘు, బట్టపోతుల సతీష్, పంతులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.